ప్రజలను మోసం చేస్తున్న చంద్రబాబు

- వెరిఫికేషన్ పేరుతో వికలాంగుల పెన్షన్లు తొలగింపు
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సుధీర్ భార్గవ్ రెడ్డి



క్యూర్ కోడ్ ద్వారా చంద్రబాబు మోసాలు వివరిస్తున్న డాక్టర్ సుధీర్‌భార్గవ్‌రెడ్డి

సత్తెనపల్లి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను సీఎం చంద్రబాబు మోసం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి విమర్శించారు.

మండలంలోని కందులవారిపాలెం గ్రామంలో మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమ రావు అధ్యక్షతన గురువారం నిర్వహించిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినప్పటికీ కొత్త పింఛన్లు మంజూరు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. వెరిఫికేషన్ పేరుతో వికలాంగుల పింఛన్లను తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారమే పరమావధిగా అమలు సాధ్యం కానీ హామీలిచ్చి.. అమలు చేయలేమని చేతులెత్తేయడం జనాన్ని మోసం చేయడమేనన్నారు. నాడు జగనన్న మరిన్ని పథకాలతో ప్రజలకు మంచి ఎలా చేయాలా అని ఆలోచిస్తే.. నేడు సీఎం చంద్రబాబు హామీలను ఎలా ఎగ్గొట్టాలా అని ఆలోచిస్తున్నారని ఎద్దేవా చేశారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయడానికి ఏడాదిన్నర పట్టిందా అని నిలదీశారు. ముందుగా గ్రామంలో ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించారు. గ్రామంలో అధిక శాతం మంది మహిళలు గ్యాస్ డబ్బులు పడలేదని, పింఛన్లు తొలగిస్తున్నారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు కళ్ళం విజయ భాస్కరరెడ్డి, సంకటి శ్యాంసన్, కొర్లకుంట వెంకటేశ్వర్లు, చిలుకా జైపాల్, కొమెర శివశంకర్, నందిగం యల్లమంద, బొంతు వెంకటరెడ్డి, సర్పంచ్ బూతుకూరి బ్రహ్మారెడ్డి, బూతుకూరి లక్ష్మారెడ్డి, బూతుకూరి అంజిరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

సత్తెనపల్లి: వినాయక చవితి పండుగ సందర్భంగా విగ్రహాలు ఏర్పాటు చేసే ముందు పోలీస్‌స్టేషన్‌లో అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సత్తెనపల్లి రూరల్ ఎస్ఐ షేక్ అమీనుద్దీన్ గురువారం తెలిపారు. వినాయక ఉత్సవాలకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవ నిర్వహణ దరఖాస్తు ఫారంను ప్రత్యేకంగా రూపొందించడం జరిగిందన్నారు. ఉత్సవ కమిటీ పేరు, నిర్వాహకుల వివరాలు, ఆధార్ నెంబర్లు, విగ్రహాన్ని ఉంచే ప్రదేశం, ఎత్తు, నిమజ్జనం తేదీ, సమయం, నిమజ్జన ప్రదేశం, ఊరేగింపు మార్గం, వాహన డ్రైవర్, మండపంలో రాత్రి బస చేసే వారి వివరాలు, ఫోన్ నెంబర్లు దరఖాస్తు ఫారంలో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. మండపాల్లో, ఊరేగింపుల్లో రాజకీయ ప్రేరేపిత పాటలు, ప్రకటనలు చేయరాదని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఉత్సవాలు ముగిసే వరకు పోలీస్ శాఖకు సహకరించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను ప్రారంభించిందని, నిర్వాహకులు ఈ వెబ్‌సైట్ ద్వారా సింగిల్ విండో విధానంలో అనుమతులు పొందవచ్చన్నారు. బహిరంగ ప్రదేశాలలో ఏర్పాటు చేసే వినాయక మండపాలకు మాత్రమే ఈ అనుమతులు తప్పనిసరని అన్నారు.

ముప్పాళ్ళ: వినాయక చవితిని పురస్కరించుకొని ఏర్పాటు చేసే వినాయక మండపాలు, పందిళ్లకు అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ వి.సోమేశ్వరరావు గురువారం తెలిపారు. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసే వినాయక మండపాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెబ్‌సైట్ ద్వారా సింగిల్ విండో విధానంలో అనుమతులు పొందవచ్చన్నారు. అనుమతులు పొందటానికి ఎలాంటి రుసుము అవసరం లేదన్నారు. మండపాలు ఏర్పాటు చేసే కమిటీల వివరాలు పోలీస్‌స్టేషన్‌లో అందివ్వాలని అన్నారు.

క్రోసూరు: వినాయక చవితి సందర్భంగా గణేష్ విగ్రహాలు, మండపాలు ఏర్పాటు చేసుకునే వారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్ఐ పి.రవిబాబు కోరారు. గురువారం పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్, మైకు, డీజేలు పెట్టుకునేందుకు విడివిడిగా అనుమతులు పొందాలన్నారు. నిమజ్జనానికి ఎప్పుడు, ఏ మార్గంలో వెళ్లేది పోలీసులకు ముందుగా తెలియజేయాలన్నారు. మండపాలలో రాత్రి సమయాల్లో కాపలా ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు.

రాజుపాలెం: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా పోలీసు వారి అనుమతులు పొందాలని ఎస్ఐ వేణుగోపాల్ గురువారం తెలిపారు. ముందుగానే నిమజ్జనం చేసే ప్రదేశంను, రూట్ మ్యాప్‌ను తెలియపరచాలని అన్నారు. విద్యుత్ శాఖ, మైక్ పర్మిషన్ తీసుకోవాలని, పూజా సమయంలోనే మైకులను వినియోగించాలని చెప్పారు.

క్లుప్తంగా

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అచ్చంపేట: మండల పరిధిలోని చల్లగరిగ, మాదిపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలలో నూతన విద్యుత్ లైన్ల క్రమబద్ధీకరణలో భాగంగా 22, 23 తేదీలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఏఈ జి.శివకోటిరెడ్డి గురువారం తెలిపారు. వినియోగదారులు, విద్యుత్ ఆధారిత వ్యాపారులు సహకరించవలసినదిగా ఆయన కోరారు.

24న సరస్వతి శిశుమందిర్‌లో అష్టావధానం

సత్తెనపల్లి: స్వామి వివేకానంద చైతన్య భారతి ఆధ్వర్యంలో పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 24న సాయంత్రం 5.30 గంటలకు అష్టావధానం జరుగుతుందని స్వామి వివేకానంద చైతన్య భారతి గౌరవ అధ్యక్షుడు కొల్లిపర కాశీ విశ్వనాథం గురువారం తెలిపారు. బ్రహ్మశ్రీ ఉప్పలదడియం భరత్ శర్మచే జరిగే అష్టావధానంకు సంచాలకులు బ్రహ్మశ్రీ పోలూరి వెంకట శివరామప్రసాద్‌రావు హాజరవుతారన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కష్టపడి చదివి ఉన్నత స్థానాలు చేరుకోవాలి



సత్తెనపల్లి: విద్యార్థినులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సత్తెనపల్లి టౌన్ ట్రైనీ ఎస్ఐ బుర్రా యష్ణ అన్నారు. పట్టణంలోని శాంతి నికేతన్ జూనియర్ కళాశాలలో గురువారం ఎస్సీ, బీసీ బాలికల వసతి గృహ విద్యార్థినులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ యష్ణ మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి కళాశాలలకు పంపుతున్నారని, ప్రతి విద్యార్థిని కష్టపడి చదువుకుంటే కచ్చితంగా ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. వసతి గృహాల్లో సమస్యలు ఉంటే సంక్షేమ అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. వసతి గృహాల్లో మెనూ పాటించాలని సంక్షేమ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రమణారెడ్డి, విద్యార్థినిలు, తదితరులు ఉన్నారు.

అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా బత్తుల



సత్తెనపల్లి: పట్టణానికి చెందిన న్యాయవాది బత్తుల ఆదినారాయణ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ తనకు వచ్చిన ఈ అవకాశాన్ని వినియోగించుకొని ప్రభుత్వం తరపున వాదనలు వినిపిస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులు, అధికారులు, న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం



పెదకూరపాడు: మండల పరిధిలోని 75 త్యాళ్లూరు గ్రామంలో కొలువుదీరిన కాశీవిశ్వేశ్వర దేవస్థానంలో గురువారం మాస శివరాత్రి సందర్భంగా మహన్యాస రుద్రాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితులు నుదురుపాటి హనుమంతరావు శర్మ, హరినాథ్ శర్మ గణపతి పూజ, పంచామృత అభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. పూజల్లో ఈద శ్రీనివాస్ రెడ్డి, పద్మావతి దంపతులు, ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఈ-పాస్ మిషన్ ద్వారానే ఎరువుల అమ్మకాలు జరపాలి



సత్తెనపల్లి: ఈ-పాస్ మిషన్ ద్వారానే ఎరువులు అమ్మకాలు జరపాలని, ఈ-పాస్ మెషిన్‌లోని స్టాకు, భౌతిక నిల్వలకు సరిపోలి ఉండాలని ఏవో బి.సుబ్బారెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని ఏవో, తహసీల్దార్ తదితరులు పలు ఎరువుల దుకాణాల్లో గురువారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఏవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ-పాస్ మెషిన్‌లోని స్టాక్‌కు, భౌతిక నిల్వలకు ఎరువులు సరిపోలి ఉండాలని, వ్యత్యాసం ఉన్నచో వారికి ఎరువుల కేటాయింపు జరగదన్నారు. తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి ఎరువుల గోడౌన్‌లోని స్టాకును, ఈ-పాస్ మెషిన్‌లోని నిల్వలను సరిపోల్చి చూశారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరెడ్డి ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి నిల్వలను పరిశీలించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి డిప్యూటీ తహసీల్దార్ కె.రవికుమార్, ఆర్ఐ బోస్‌బాబు తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



తహసీల్దార్ చక్రవర్తికి వినతిపత్రం అందిస్తున్న పెండ్యాల మహేష్, అంగన్‌వాడీలు

సత్తెనపల్లి: అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయు) గౌరవాధ్యక్షుడు పెండ్యాల మహేష్ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ఆధ్వర్యంలో సత్తెనపల్లి తహసీల్దార్ కెఎస్ చక్రవర్తికి గురువారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పెండ్యాల మహేష్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు వేతనాలు పెంచలేదని, పని భారం బాగా పెరిగిందని అన్నారు. 42 రోజుల అంగన్‌వాడీల సమ్మె సందర్భంగా వేతనాలు పెంచుతామని మినిట్ ఇచ్చి ఇంతవరకు పెంచలేదని, ఇది చాలా అన్యాయమన్నారు. అంగన్‌వాడీలకు ఇచ్చిన ఫోన్‌లు పనిచేయక చాలా సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. వెంటనే 5జి ఫోన్లు ఇవ్వాలని, గ్రాడ్యుటీ జీవోలో మార్పులు చేసి కొత్త జీవో ఇవ్వాలని, యూనియన్ నాయకులను చర్చలకు పిలిచి వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ సత్తెనపల్లి ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు సుజాత, అహల్య, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ డానియేల్‌కు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్

అమరావతి: అంగన్‌వాడీ వర్కర్‌లు, హెల్పర్స్ పని చేయని ఫోన్‌లను సీడీపీవో ఆఫీసులో ఇచ్చినప్పటికీ ప్రభుత్వం కొత్తఫోన్లు మంజూరు చేయలేదని, కనీస వేతనాలు పెంపుదల హామీ ఇచ్చి 13 నెలలు దాటినా పెంచక పోవటంపై అంగనవాడీ వర్కర్స్, హెల్పర్‌లు గురువారం తహసీల్దార్ డానియేల్‌కు వినతిపత్రం అందించారు. అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ పనిభారాలు పెంచి ఉద్యోగస్తులుగా గుర్తించకపోగా అన్ని పనులు చేయిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు వర్తించట్లేదని అడిగితే ప్రభుత్వంలో పని చేస్తున్నట్లు మా ఆధార్ కార్డులలో చూపిస్తున్నాయని అధికారులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగనవాడీ కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్తంగా బ్లాక్ డే ప్రకటించి అన్ని మండల కేంద్రాల్లో తహసీల్దార్‌లకు వినతిపత్రాలు ఇచ్చామన్నారు.

వినాయక విగ్రహాల నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు



నిమజ్జన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అమరావతిలో జరిగే వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమానికి ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పటిష్టంగా బందోబస్తును ఏర్పాటు చేయాలని ఎంపీపీ మేకల హనుమంతరావు అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక ధ్యానబుద్ధ విగ్రహం వెనుక బాగంలో ఇసుకరీచ్‌లో వినాయక విగ్రహ నిమజ్జన ప్రదేశాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ చుట్టుపక్కల మండలాల నుంచే కాక దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కులుగకుండా అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సందర్భంగా సీఐ అచ్చియ్య మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించే ఉత్సవ కమిటీలు, భక్తులు తప్పక పోలీసు నిబంధనలను పాటించి సహకరించాలన్నారు. కృష్ణానది వద్ద పోలీసుశాఖ నిర్ణయించిన ప్రదేశంలోనే విగ్రహాలను నిమజ్జనం చేయాలని, ఊరేగింపులో రాజకీయ పార్టీల జెండాలు పెట్టరాదన్నారు. నది మధ్యలో నిమజ్జనం చేయటానికి ధరణికోట గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ డానియేల్, అమరావతి, ధరణికోట పంచాయతీ కార్యదర్శులు శివరావు, వెంకటాద్రి, ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది ఎక్కడ..?

సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంపీడీవో



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో సోమయాజులు

పెదకూరపాడు: మండలంలోని గారపాడులో సచివాలయ ఉద్యోగులు విధులకు డుమ్మా కొట్టారు. గురువారం ఎంపీడీవో సోమయాజులు, ఈవోపీఆర్డీ శరత్ సచివాలయాలను తనిఖీ చేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్ మాత్రమే ఉన్నారు. మిగిలిన వారు విధుల్లో లేరు. మండల అధికారుల నుంచి సెలవు కూడా తీసుకోలేదని వారు తెలిపారు. వారు ఉన్న సిబ్బందిని అడగగా సొంత పనులపై వెళ్లారని సమాధానం ఇచ్చారు. రోజువారి మూమెంట్ రిజిస్టర్లో కూడా ఎటువంటి నమోదు చేయలేదు. విధులకు హాజరైనట్లు సంతకం చేసే రిజిస్టర్ కూడా అందుబాటులో లేదు. విధులకు గైర్హాజరైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. హుస్సేనగరం సచివాలయంలో సిబ్బంది ఉన్నా.. వారికి కేటాయించిన పనులు చేయటంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

సేద్యం చేసుకునేందుకు ఉపక్రమించిన రైతులు

అడ్డుకున్న అటవీశాఖాధికారులు



రైతుల వివరాలు సేకరిస్తున్న ఫారెస్ట్ అధికారులు

అచ్చంపేట: రెండు దశాబ్దాల క్రితం ప్రభుత్వం ఇచ్చిన భూములను వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సాగు చేసుకునేందుకు మండలంలోని చెరుకుంపాలెం గ్రామానికి చెందిన రైతులు సిద్ధపడగా అటవీ శాఖాధికారులు అడ్డుకున్న ఘటన గురువారం చోటు చేసుకుంది. బాధిత రైతులు తెలిపిన వివరాలు.. మండలంలోని చెరుకుంపాలెం, కొత్తపల్లి గ్రామాలకు చెందిన నిరుపేద రైతులకు తాళ్లచెరువు రెవెన్యూ పరిధిలోని 320, 321, 322 సర్వే నెంబర్లలో ఒక్కొక్కరికి ఎకరం, ఎకరంన్నర భూములను కేటాయిస్తూ 1993లో రెవెన్యూ అధికారులు పట్టాలు పంపిణీ చేశారు. 55 మందికి పట్టాలు ఇవ్వగా అందులో 18 మంది రైతులు వివిధ కారణాలతో సాగు చేసుకోలేదు. గత రెండేళ్లుగా సాగు చేసుకునే ప్రయత్నం చేస్తుండగా ఫారెస్ట్ అధికారులు ఈ భూములు తమ పరిధిలోకి వస్తాయంటూ అడ్డు చెబుతున్నారు. దీంతో వారు అచ్చంపేట తహసీల్దారు, ఆర్డీవో, జాయింట్ కలెక్టర్లకు ఫిర్యాదు చేయగా రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులపై జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేయించి మీకు త్వరలో న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు బాధిత రైతులు తెలిపారు. రెండేళ్లుగా ఇదేమాట చెబుతుండటంతో గురువారం ప్రజా సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సేద్యం చేసుకునేందుకు ఉపక్రమించడంతో ఫారెస్ట్ అధికారులు అడ్డుతగిలినట్లు తెలిపారు. అయినా రైతులు తగ్గకపోవడంతో అచ్చంపేట పోలీసులు వచ్చి సమస్య పరిష్కారం అయ్యేంతవరకు భూములలోకి వెళ్లవద్దొంటూ ఎటోళ్లను అటు పంపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వంకాయలపాటి రాణి, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి జి.రవిబాబు, అచ్చంపేట, క్రోసూరు మండలాల నాయకులు కె.నర్సరాజు, కెకె రెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు టి.హనుమంతరావు, రైతు సంఘ నాయకులు వెంకటేశ్వర్లు, బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రీ సర్వేపై గ్రామ సభ

ముప్పాళ్ళ: మండలంలోని నార్నెపాడు గ్రామంలో పాలకేంద్రం వద్ద 22వ తేదీన(శుక్రవారం) రీ సర్వే కార్యక్రమంలో భాగంగా ముసాయిదా డ్రాఫ్ట్ ల్యాండ్ రికార్డుపై గ్రామ సభ జరుగుతుందని తహసీల్దార్ కె.నగేష్ గురువారం తెలిపారు. నార్నెపాడు గ్రామ రెవెన్యూ పరిధిలోని భూ యజమానులు గ్రామ సభలో పాల్గొని భూముల వివరాలను పరిశీలించుకోవచ్చని చెప్పారు.

ప్లాస్టిక్ వినియోగం ప్రమాదం



అమరావతి: ప్లాస్టిక్ సంచుల వినియోగంతో ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం పొంచి ఉందని స్టేట్ ఆడిట్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.వి.సుబ్బారావు అన్నారు. స్థానిక జన చైతన్య సమితి ఉచిత నైపుణ్యాభివృద్ధి మహిళ శిక్షణ కేంద్రంలో గురువారం జన చైతన్య సమితి ఆధ్వర్యంలో కుట్టిన గుడ్డ సంచులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు జన చైతన్య సమితి కృషి చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. ప్లాస్టిక్ నివారణకు క్లాత్ బ్యాగులను కుట్టించి ఉచితంగా పంపిణీ చేస్తున్నామని జన చైతన్య సమితి కార్యదర్శి తుళ్లూరి సాంబశివరావు తెలిపారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు బెజ్జం నాగేశ్వరరావు, వంశీ, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పొలాల్లోని బావులకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకోవాలి

తహసీల్దార్ నాగరాజు



క్రోసూరు: మండలంలోని అన్ని గ్రామాల రైతులు తమ పొలాల్లోని బావులకు రక్షణ గోడలు, ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకోవాలని తహసీల్దార్ వి.వి.నాగరాజు గురువారం రైతులను కోరారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ వ్యవసాయ భూములలో సాగు నిమిత్తం తవ్విన ఓపెన్ బావులకు రక్షణ గోడలు లేకపోవుట, బావి స్థానాన్ని సూచించే గుర్తులు ఏర్పాటు చేయకపోవుట గుర్తించినట్లు చెప్పారు. దీని వలన చిన్న పిల్లలు, పశువులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. కావున రైతులు బావుల చుట్టూ తప్పనిసరిగా రక్షణ గోడలు, బావి సూచించే గుర్తులు, రక్షణ వలయం, ఫెన్సింగ్ వంటివి ఏర్పాటు చేయవలసినదిగా కోరారు. దీంతో ప్రమాదాలు నివారించబడతాయన్నారు.

మున్సిపల్ కమిషనర్ ఆనంద్ కుమార్‌కు సత్కారం



సత్తెనపల్లి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ కమిషనర్‌గా అవార్డు అందుకున్న మున్సిపల్ కమిషనర్ ఎన్.ఆనంద్‌కుమార్‌ను నియోజకవర్గంలోని ఎస్సీ సెల్ నాయకులు గురువారం కలిసి అభినందించారు. పూలమాలలు, దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకులు బలిజేపల్లి సురేష్‌కుమార్, బండారు నాగరాజు, కంభంపాటి అబ్రహం, వెలిశాల వెంకట్రావు, చిలుకా శ్యామ్, మాలపాటి నవీన్‌బాబు, చింతపల్లి అజయ్‌కుమార్, గుజ్జర్లపూడి స్కైలాబ్, మల్లవరపు జోజి, నల్లూరి రవి తదితరులు ఉన్నారు.

డీఎల్ఆర్‌పై అభ్యంతరాలుంటే అప్పీలు చేసుకోవాలి



సత్తెనపల్లి: రీ సర్వే జరుగుతున్న సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి గ్రామంలో ఫైనల్ డీఎల్ఆర్ (డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్)పై అభ్యంతరాలు ఉంటే తహసీల్దార్‌కు అప్పీలు చేసుకోవాలని సత్తెనపల్లి తహసీల్దార్ కె.ఎస్.చక్రవర్తి అన్నారు. కంకణాలపల్లి సచివాలయంలో గురువారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ కంకణాలపల్లిలో రీ-సర్వే పూర్తి కాబడిందన్నారు. ప్రభుత్వ భూములను 324 ఎల్‌పీఎంలుగా విస్తీర్ణం య.283.19 సెంట్లు గాను, 1381 ఎల్‌పీఎంలను ప్రైవేటు భూములకు/రైతుల భూములకు య.1496.11 సెంట్లు కేటాయింపులు చేశారు. గ్రామ సభలో పట్టాదారుల వివరాలు చదివి వినిపించారు. గ్రామ సచివాలయంలో సదరు డీఎల్ఆర్ లిస్టును ప్రచురించారు. సమావేశంలో మండల మొబైల్ మెజిస్ట్రేట్ (రీ సర్వే) ఎన్.రవికుమార్, సర్వేయర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు, ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో అర్జీ పరిష్కారానికి క్షేత్ర స్థాయి పరిశీలన



నాగవరంలో అర్జీదారు పొలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న ఆర్డీవో రమణకాంత్ రెడ్డి

క్రోసూరు: మండలంలోని నాగవరం గ్రామానికి రైతు మిరియాల శ్రీనివాసరావు తన భూమి కొలత విషయంపై ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో పలుమార్లు అర్జీలు పెట్టుకోవటంతో సత్తెనపల్లి ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి గురువారం తహసీల్దార్ వి.వి.నాగరాజుతో కలిసి అర్జీదారుడి పొలాన్ని పరిశీలించారు. అర్జీదారుడు తన భూమి ఆన్‌లైన్‌లో ఉన్న దానికంటే క్షేత్రస్థాయిలో తక్కువగా ఉందని, పరిశీలించి తనకు న్యాయం చేయాలని కోరగా ఆర్డీవో హాజరయ్యారు. అర్జీదారుడు హాజరుకాలేదు. దీంతో అర్జీదారుడు తల్లిదండ్రుల సమక్షంలో భూమి హద్దులు పరిశీలించి చుట్టు పక్కల రైతుల వద్ద స్టేట్‌మెంట్ నమోదు చేసుకుని వెనుతిరిగారు. కార్యక్రమంలో వీఆర్వో ఆనంద్, విలేజి సర్వేయర్ గురవయ్య తదితరులు పాల్గొన్నారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలందరితో ఆర్డీవో మాట్లాడారు. ప్రస్తుతం రైతుల అర్జీలు ఎన్ని పెండింగ్ ఉన్నాయని తెలుసుకుని త్వరగా పరిష్కరించాలని కోరారు.

ఘనంగా మాస శివరాత్రి పూజలు



కాశీవిశ్వేశ్వర ఆలయంలో స్వామి వారికి పూలాభిషేకం చేస్తున్న దృశ్యం

నకరికల్లు: మాస శివరాత్రిని మండలంలోని ప్రముఖ ఆలయాల్లో గురువారం వైభవంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆలయాలతో పాటు నర్సింగపాడులోని మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో, అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో విశేషంగా పూజలు నిర్వహించారు. అర్చకులు పమిడిమర్రు శ్రీనివాసరావు, కొమ్మువరపు పవన్‌కుమార్‌శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి విశేష ద్రవ్యాలతో అభిషేకాలు చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి లక్షమల్లెల అర్చనలు చేశారు. పలు గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సామూహిక కుంకుమ పూజల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. పొంగళ్లు పొంగించి స్వామి వార్లకు సమర్పించి మొక్కులు చెల్లించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ఆరుగురికి జరిమానా



తనిఖీలు చేస్తున్న ఎస్ఐ రవిబాబు

క్రోసూరు: క్రోసూరు ఎస్ఐ పి.రవిబాబు, ట్రైనీ ఎస్ఐ గోపి, పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ఆరుగురు పట్టుబడగా వారిని కోర్టులో హాజరుపరచగా రూ.60 వేలు అపరాధ రుసుము విధించినట్లు ఎస్ఐ రవిబాబు గురువారం తెలిపారు. అదేవిధంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరుపరచగా కోర్టు అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. అదేవిధంగా మండలంలోని ఎర్రబాలెం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న సమాచారం మేరకు దాడి చేయగా ఇద్దరిని అదుపులోకి తీసుకోగా నలుగురు పరారైనట్లు చెప్పారు. వారి వద్ద నుంచి రూ.1,400 స్వాధీన పరుచుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో అన్నాచెల్లెళ్లకు తీవ్రగాయాలు



తీవ్రగాయాలైన వెంకటేష్



తీవ్రగాయాలైన పావని

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో అన్నాచెల్లెళ్లకు తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని ధూళ్ళిపాళ్ల భాగ్యనగర్ కాలనీ వద్ద గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. అచ్చంపేట మండలం నిండుజర్ల గ్రామానికి చెందిన వెంకటేష్, అతని సోదరి పావని ద్విచక్ర వాహనంపై మంగళగిరి వెళ్లేందుకు సత్తెనపల్లి వైపు వస్తుండగా ధూళ్ళిపాళ్ల భాగ్యనగర్ కాలనీ వద్ద గుంటూరు వైపు నుంచి పిడుగురాళ్ల వెళ్లేందుకు వస్తున్న కారు ఢీ కొట్టడంతో అన్నాచెల్లెలు ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

23 మంది వికలాంగ పెన్షనర్లకు నోటీసులు

క్రోసూరు: మండలంలో వికలాంగులకు ఇచ్చే సామాజిక పింఛన్లలో 40 శాతం కంటే తక్కువ ఉండి పింఛన్లు పొందుతున్నారని తొలగించేందుకు మొత్తం 23 మందికి నోటీసులిచ్చినట్లు ఎంపీడీవో రవికుమార్ గురువారం తెలిపారు. వీరిలో 18 మందికి పింఛన్ నిలిపివేయగా, ఇద్దరు పింఛన్‌దారులు రూ.15 వేల నుంచి రూ.6 వేలు పొందేందుకు, మిగతా ముగ్గురు వృద్ధాప్య పింఛన్ కింద నమోదయ్యారని తెలియజేశారు. అయితే 23 మంది తిరిగి అప్పీల్ చేసుకుని అర్హత ఉంటే వికలాంగ పెన్షన్లు పొందవచ్చని ఎంపీడీవో తెలిపారు.